కలలని గురించి ఇంకొకరికి చెప్పుకున్నాం. మా అందరికీ ఆ కలల్లో అన్నసత్రం మల్లప్ప గురించి ప్రార్థించాలన్న ప్రేరణ ఎందుకో కలిగింది. దాంతో ఆ రాత్రి చాలాసేపు ఆ ప్రార్థన చేస్తూండి పోయాం.''

అది విన్న భోజన పంక్తిలోని వారంతా ఆశ్చర్యంగా తమలో తాము మాట్లాడుకుంటూంటే, మల్లప్ప మాత్రం గబగబా వాళ్ళని లెక్కపెట్టాడు.

వాళ్ళు సరిగ్గా ఏడుమంది ఉన్నారు!

## 49. బార్బర్

క్షవరం చేయించుకోడానికి ఓ వ్యక్తి బార్బర్ దుకాణానికి వెళ్ళాడు. పని జరుగుతూండగా కాలక్షేపానికి వాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు. అనేక విషయాలు మాట్లాడుకున్నాక వారి సంభాషణ తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాల మీదకి మళ్ళింది.

ఆ బార్బర్ నాస్తికుడు కావడంతో చెప్పాడు.

''దేవుడనేవాడు లేడండి. అయినా లక్షలమంది వెర్రివాళ్ళయి ఎందుకలా తమ డబ్బు, కాలం ఖర్చు చేసుకుని తిరుపతికి వెళ్తున్నారో నాకర్థం కావడంలేదు.''

''దేవుడు లేడని ఎందుకనుకుంటున్నావు?'' ప్రశ్నించాడా కస్టమర్.

''ఓసారి అలా రోడ్డు మీదకి వెళ్ళి చూడండి. దేవుడనే వాడంటూ ఉంటే, ఇంతమంది రోగులూ, అనాథ పిల్లలు, ఇంత దుఃఖం ఈ ప్రపంచంలో ఎందుకుంటుంది? వీటన్నిటినీ చూస్తూ వాళ్ళ కన్నీరు తుడవకుండా, ఏంచేయకుండా ఉంటాడా దేవుడు?''

ఆ కస్టమర్ భక్తిపరుడే అయినా ఆ విషయం మీద చర్చ అనవసరం అనుకుని దాన్ని ఖండించలేదు. తన పని పూర్తయ్యాక డబ్బిచ్చి ఆ షాప్‌లోంచి బయటకి వెళ్ళాడు.

ఆ బార్బర్ ఇంకొకరి పని మొదలుపెట్టక మునుపే కొద్ది క్షణాల్లో మళ్ళీ ఆ షాప్‌లోకి వచ్చి ఆ బార్బర్‌ని అడిగాడతను.

"ఇందాక నువు నాతో దేవుడే లేడన్నావు కదూ?"

"అవును సార్." వప్పుకున్నాడు వాడు.

"నువు దేవుడనే వాడే లేడన్నావు. నేనసలు ఈ లోకంలో బార్బర్ అనేవాడే లేడంటాను. దానికి నువ్వేమంటావు?"

"చిత్రంగా మాట్లాడుతున్నారేమిటి? ఇప్పుడేగా నాచేత మీరు హెయిర్ కటింగ్ చేయించుకుంది? నేను ఎదురుగా కనబడటం లేదా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఆ బార్బర్.

"ఓ సారి దయచేసి బయటకి వస్తావా?"

ఇద్దరూ బయటకి వెళ్ళాక ఆ కస్టమర్ కొద్ది దూరంలో కూర్చుని ఉన్న ఓ బిచ్చగాడి వంక చూపించాడు. తైల సంస్కారం లేని అతని జుట్టు, గడ్డం బాగా పెరిగి ఉన్నాయి.

"ఈ లోకంలో బార్బర్స్ అంటూ ఉంటే ఇలా జుట్టూ, గడ్డం పెరిగిన వాళ్ళు ఎందుకుంటారు?" ప్రశ్నించాడు ఆ కస్టమర్.

"డబ్బులేక వాడు నా దగ్గరకి రాలేదు. డబ్బుతో వస్తే మీకు చేసినట్లుగా వాడికి క్షవరం చేసేవాడ్నిగా?"

"కదా! అలాగే భక్తి అనే డబ్బు లేక చాలామంది దేవుడి దగ్గరకి వెళ్ళటంలేదు. దాంతో ఈ ప్రపంచంలో తమ కష్టాలని వదిలించుకోలేని ఎంతోమంది అనాధలుగా, రోగులుగా ఉన్నారు." వివరించాడా కస్టమర్.

## 50. కష్టాలు మన మంచికే

ఎన్నో కష్టాల్లో ఉన్న ఒకతను తన సద్గురువు దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"ఏమిటి స్వామీ నాకీ కష్టాలు? ఇవి ఎప్పటికి తీరేను? అసలు దేవుడు నన్నెందుకు పట్టించుకోడు?"